విచారణ పేరిట కాలయాపన

- కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోరా..!
- పంచాయతీ కార్యదర్శిని ఓ ఉన్నతాధికారి కాపాడుతున్నట్లు విమర్శలు

పరిగి, ఫిబ్రవరి 23 : అక్రమాలకు పాల్పడిన నస్కల్ గ్రామపంచాయతీ కార్యదర్శి ఫరూఖ్‌హుస్సేన్‌పై చర్యలు తీసుకోవాలని పరిగి మండలం నస్కల్ గ్రామస్తులు వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు ఫిర్యాదు చేసినా కేవలం విచారణ జరపడం తప్ప అధికారులు చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలున్నాయి. నిధుల దుర్వినియోగం, వ్యవసాయేతర భూమిగా మారకముందే అనుమతులు వంటి ఆరోపణలు రుజువైనా చర్యలు తీసుకోకపోవడం వెనకాల ఒక ఉన్నతాధికారి ఉదాసీన వైఖరి కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాభివృద్ధికి వచ్చిన నిధులను సొంతానికి వాడుకొని, గ్రామంలో గ్రూపు రాజకీయాలు చేస్తున్న గ్రామ కార్యదర్శి ఫరూఖ్‌హుస్సేన్ తాను స్పీకర్ మనిషినని, తనను ఎవరూ ఏమి చేయలేరంటూ గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కలెక్టర్‌కు గ్రామస్తులు గత డిసెంబర్ 9న ఫిర్యాదు చేశారు. 2024 ఫిబ్రవరి నుంచి సెప్టెంబర్ వరకు వచ్చిన నిధులు రూ.12,01454లలో సొంతానికి రూ.249117 వాడుకున్నారని, పారిశుధ్య కార్మికుల వేతనాలు ఇచ్చినవి రూ.392000 కాగా.. రూ.520750 ఇచ్చినట్లు చూపించారన్నారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు విన్నవించారు. కొత్తగా లేఅవుట్ చేస్తున్న భూమి వ్యవసాయేతర భూమిగా మార్పు చేయకముందే ఇంటి నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి ఎలా అనుమతి ఇస్తారని వారు ప్రశ్నించారు. దీని వెనకాల అవినీతి జరిగిందని వారు ఆరోపించారు. వెంటనే పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు ఫిర్యాదు చేస్తున్న నస్కల్ గ్రామస్తులు (ఫైల్)

కలెక్టర్ ఆదేశించినా..

అంతకుముందే ఇదే విషయమై గ్రామస్తులు డీఎల్‌పీవోకు ఫిర్యాదు చేయగా డిసెంబర్ 2న విచారణ చేపట్టిన డీఎల్‌పీవో సంధ్యారాణి గ్రామపంచాయతీ రికార్డులను సీజ్ చేసి తీసుకువెళ్లారు. అనంతరం అధికార పార్టీ నాయకులతో జిల్లా ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకురావడం, ఒక ఉన్నతాధికారి ఉదాసీన వైఖరి వల్ల పంచాయతీ కార్యదర్శిపై ఇప్పటివరకూ చర్యలు తీసుకోలేదు. ఈ అంశంపై వెంటనే చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కు కలెక్టర్ ఆదేశించినా ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు లేకపోవడం విడ్డూరం.

అనుమతి లేకుండానే..

ఇదిలావుండగా నస్కల్ గ్రామంలో గల పాత గ్రామపంచాయతీ భవనాన్ని జనవరి 2న పంచాయతీ కార్యదర్శి జేసీబీతో కూల్చివేయించారు. డ్వాక్రా భవనం నిర్మాణానికి నిధులు వస్తున్నాయంటూ అధికార పార్టీ నేతలు చెప్పినట్లుగా వినడం వల్లే పాత భవనాన్ని కూల్చివేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైనా భవనం కూల్చివేయాలంటే సంబంధిత ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటిదేమీ లేకుండానే ప్రజలు తమ పొలం పనులకు వెళ్లిన తర్వాత గ్రామపంచాయతీ పాత భవనాన్ని జేసీబీతో కూల్చివేయడం విమర్శలకు తావిస్తున్నది. సాధారణంగా భవనం కూల్చివేయాలంటే గ్రామపంచాయతీ తీర్మాణం చేసి ఉన్నతాధికారులకు పంపించడంతోపాటు భవనం నివాసయోగ్యంగా లేదని ఇంజినీరింగ్ అధికారుల ధ్రువీకరణ తర్వాతే కూల్చివేత చేపట్టాలి. భవనం కూల్చివేత విషయమై మండల పంచాయతీ అధికారిని అడుగగా తమకు ఏమీ తెలియదని, తమ దృష్టికి రాలేదని, తమ అనుమతి ఎవరూ తీసుకోలేదని చెప్పడం గమనార్హం. ఈ అంశంపై ఫిర్యాదు చేయగా గత శనివారం డీఎల్‌పీవో గ్రామంలో విచారణ జరిపారు. నస్కల్ గ్రామం పరిగి మున్సిపాలిటీలో విలీనం జరుగుతుందని తెలియగానే మున్సిపల్ పరిధిలోకి వెళ్తే అనుమతులు త్వరగా రావంటూ, అధికంగా ఖర్చవుతుందని చెప్పి పలువురికి ముందస్తుగానే ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చారని, ఇందులోనూ పెద్దఎత్తున అవినీతి చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పూర్తిస్థాయిలో విచారణ చేసినా..

గ్రామపంచాయతీలో ఇంటి నిర్మాణ అనుమతులు సైతం ఆన్‌లైన్ ద్వారానే ఇవ్వాల్సి ఉన్నది. జనవరి 28న నస్కల్ గ్రామం పరిగి మున్సిపాలిటీలో విలీనం తర్వాత సైతం ఇంటి నిర్మాణ అనుమతులకు పంచాయతీ కార్యదర్శి ప్రయత్నించగా ఆన్‌లైన్‌లో లింక్ కట్ చేశారని, లేదంటే నేను ఇచ్చేవాడినంటూ అధికార పార్టీలోని ఒక వర్గం నాయకులను రెచ్చగొట్టి తీసుకువచ్చి ఎంపీడీవోపై లొల్లి పెట్టించడం గమనార్హం. నస్కల్ గ్రామపంచాయతీని మున్సిపల్‌లో విలీనం చేసే సమయంలో సిబ్బంది ఎవరెవరు పని చేస్తున్నారని వివరాలు అడుగగా అసలు పనిచేయని ఒక మహిళ పేరు పంచాయతీ కార్యదర్శి రాసివ్వడం, అనంతరం అధికార పార్టీలోని మరో వర్గం వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి మరో వ్యక్తి పేరు రాయించడం గమనార్హం. పంచాయతీ కార్యదర్శి చేస్తున్న అవినీతి అక్రమాలకు అధికార పార్టీలోని ఒక వర్గం వెనకేసుకు వస్తుండగా.. మరో వర్గం పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నదని వాపోతున్నారు. కాగా పంచాయతీ కార్యదర్శిపై వచ్చిన ఆరోపణల విషయంలో పూర్తిస్థాయిలో విచారణ చేసిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. కలెక్టర్ ఆదేశించినా చర్యలే లేకపోవడం విడ్డూరమని పలువురు పేర్కొంటున్నారు. అధికారులూ వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా పంచాయతీ కార్యదర్శిని కాపాడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కులకచర్ల, ఫిబ్రవరి 23 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ అన్వేశరెడ్డి తెలిపారు. ఈ నెల 16న చౌడాపూర్ దారిలో పచావ్‌కుంటతండా సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్నాయి. అందులో చౌదరిగూడెం మండలం గాలిగూడెం గ్రామానికి చెందిన సత్యయ్య(43) తలకు తీవ్రగాయాలు కాగా హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

నేడు కరెంట్ సరఫరా బంద్

పరిగి, ఫిబ్రవరి 23 : 33కేవీ కొత్త విద్యుత్ లైన్ పనుల వల్ల పరిగి మండలంలోని పరిగి, రంగంపల్లి, రాపోల్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాలకు సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో ప్రజలు సహకరించాలని కోరారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


రామచంద్రయ్య కుటుంబసభ్యులకు ఎల్‌వోసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ, ఫిబ్రవరి 23 : సీఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని అయినాపూర్ గ్రామానికి చెందిన ఈడిగి రామచంద్రయ్యగౌడ్ నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సందర్భంగా పదిహేను రోజుల క్రితం రూ.2,50,000 సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ చెక్కును పరిగి ఎమ్మెల్యే అందజేశారు. రామచంద్రయ్యకు జబ్బు పూర్తిస్థాయిలో తగ్గకపోవడంతో ఆదివారం ఎమ్మెల్యే మరో రూ.2,50,000 ఎల్‌వోసీ చెక్కును పరిగిలోని తన నివాసంలో రామచంద్రయ్య కుటుంబసభ్యులకు అందజేశారు.

తాండూరు మండలం, అంతారం తండాలో భూ కైలాస్ బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 నుంచి 28 వరకు నిర్వహిస్తారు. శివరాత్రి పండుగ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు కర్నాటక, మహారాష్ట్రతోపాటు హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో విచ్చేస్తారు. భూ కైలాస్ దర్శనానికి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు ఓం నమఃశివాయ ట్రస్ట్ చైర్మన్ వాసు పవార్‌నాయక్ తెలిపారు.
- తాండూరు రూరల్, ఫిబ్రవరి 23

రోడ్డు పనులు ప్రారంభం

పెద్దేముల్, ఫిబ్రవరి 23 : మండల పరిధిలోని మదనంతాపూర్ గ్రామ సమీపంలో రూ.49.78 కోట్లతో తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్లే రోడ్డు పనులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు.

యాలాల : ఆదివారం తాండూరు పట్టణంలోని 5వ వార్డు ఇందిరానగర్‌లో కట్టమైసమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

ఆత్కూర్‌లో నీటి ఎద్దడి

- ఎక్కువ మొత్తంలో నీరు కావాలంటే వ్యవసాయ క్షేత్రాలను ఆశ్రయించాల్సిందే..
- పట్టించుకోని అధికారులు, ఇబ్బందుల్లో గ్రామస్తులు

దెబ్బతిన్న నీటి సరఫరా పైప్‌లైన్

నీటి కోసం అల్లాడుతున్న మహిళలు

పెద్దేముల్, ఫిబ్రవరి 23 : పెద్దేముల్ మండల పరిధిలోని ఆత్కూరు గ్రామంలో నీటి ఎద్దడి నెలకొన్నది. గ్రామంలో సరిగ్గా నీరు రాక, బోరు మోటర్లు పాడవడం, చేతి పంపులు లేకపోవడంతో ప్రజలకు గుక్కెడు నీరు దొరికే పరిస్థితి లేకుండా పోయింది. ఎక్కువ మొత్తంలో నీరు కావాలంటే వ్యవసాయ క్షేత్రాలను ఆశ్రయించాల్సిందే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు అందేవి. ప్రస్తుతం తాగునీటికి ఇబ్బంది పడాల్సి వస్తున్నది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడానికి తప్ప కనీస అవసరాల మేరకు నీరు అందించలేని నిస్సహాయ స్థితిలో కొనసాగుతున్నదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రెండు రోజుల్లో పనులు

శివాలయం నుంచి గ్రామానికి నీరు సరఫరా అయ్యే పైపులైన్ పగిలిపోయింది. రెండు రోజుల్లో నూతన పైపులైన్ వేయడానికి ఆదేశాలు కూడా వచ్చాయి. కాంట్రాక్టర్ రెండు రోజుల్లో పనులు చేపడుతాడు. దీంతో గ్రామంలో నీటి సమస్య తీరుతుంది.
- అర్చన, ఆత్కూర్ గ్రామ కార్యదర్శి

బోరు ఉన్నా వాడుకలో లేదు

మా వాడలో బోరు ఉన్నా వాడుకలో మాత్రం లేదు. బోరుకు మోటరు బిగిస్తే నీటి కష్టాలు తీరుతాయి. కానీ కొంతమంది నాయకులు ఈ బోరుకున్న చేతి పంపును కూడా తీసుకెళ్లి వారికి కావాల్సిన స్థానంలో బిగించుకున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని వృథాగా పోతున్న బోరుకు మోటార్ బిగించాలని కోరుతున్నాం.
- రాజు, హరిజనవాడ

నీటి కష్టాలు మొదలయ్యాయి

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నీటి కష్టాలు మొదలయ్యాయి. నాయకులు, అధికారులు మేము సమస్యలో ఉన్నా మా వైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. కేసీఆర్ ప్రభుత్వంలో మాకు సరిపడా నీరు వచ్చేది.
- కాంతమ్మ, ఆత్కూర్

నీటి కొరత చాలా ఉంది

ఒక్క బోరులో మాత్రమే మోటర్ ద్వారా సుమారు 10 కడవల వరకు నీరు వస్తున్నది. మళ్లీ గంట తర్వాత పది కడవల వరకు నీరు వస్తుంది. తాగడానికి ఇదే నీటిని ఉపయోగిస్తున్నాం. గ్రామంలో నీటి కొరత చాలా ఉంది. అధికారులు మా సమస్యలను పరిష్కరించాలి.
- ప్రవీణ్‌కుమార్, ఆత్కూర్


రోడ్డుపైనే వేచిచూస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కనీస వసతులు లేక..

- ఇబ్బందులు పడ్డ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు
- పట్టించుకోని పాఠశాల యాజమాన్యం
- గురుకుల ప్రవేశ పరీక్షకు హాజరైన 503 మంది విద్యార్థులు

కులకచర్ల, ఫిబ్రవరి 23 : మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామ సమీపంలోని గిరిజన గురుకుల పాఠశాలలో గురుకుల 5 నుంచి 9వ తరగతుల ప్రవేశానికి పరీక్షలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 10 గంటల వరకు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. గంట ముందుగానే విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకువచ్చారు. ఈ పాఠశాల బీటీ రోడ్డుకు ఆనుకొని ఉండటంతో అక్కడ నిల్చోవడానికి స్థలం లేక ఎండలో నడిరోడ్డుపై నిలబడాల్సి వచ్చింది. వేసవిని దృష్టిలో పెట్టుకొని పాఠశాల ఆవరణలో కనీసం నీడ సౌకర్యం ఏర్పాటు చేయని ప్రిన్సిపాల్ పరీక్ష హాల్‌లోకి విద్యార్థులను అనుమతించారు. తమ పిల్లల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు రెండు గంటల పాటు రోడ్డుపైనే ఎండకు నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్థానికంగా హాస్టల్‌లో ఉండకపోవడం వల్లనే వసతుల గురించి పట్టించుకోలేదని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు. బాత్‌రూమ్‌లకు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొన్నదని విద్యార్థులు వాపోయారు.

ప్రవేశ పరీక్షకు 517 మంది విద్యార్థులకు గాను 503 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి 260 మంది విద్యార్థులకు ముగ్గురు., 6, 7, 8, 9వ తరగతిలో ప్రవేశానికి 257 మంది విద్యార్థులకు 11 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. పరీక్ష రాసేందుకు వచ్చిన ఓ విద్యార్థి తన హాల్‌టికెట్‌పై వేరేవారి పేరు, కులం వేరే ఉండటంతో ఆ విద్యార్థిని పరీక్షకు అనుమతించలేదు.

అటు పెనాల్టీలు.. ఇటు సీజ్

వ్యాపారస్తులపై కొరడా ఝుళిపిస్తున్న జీహెచ్ఎంసీ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో వాణిజ్య సంస్థలు, వ్యాపారస్తులను జీహెచ్ఎంసీ టార్గెట్ చేసింది. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించి సంబంధిత వ్యాపార సంస్థలను సీజ్ చేస్తున్నది. అంతేకాకుండా ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకుంటున్న వారిపై 25 శాతం అదనపు రుసుమును వసూలు చేస్తూ ఖజానాను నింపుకుంటున్నది. వాస్తవంగా గ్రేటర్‌లో వ్యాపార సంస్థలకు జీహెచ్ఎంసీ జారీ చేసే ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించిన జనవరి 31తో ఉచితంగా రెన్యువల్ చేసే గడువు ముగిసింది. ఈ నెల 1 నుంచి రెన్యూవల్ చేసుకోనున్న ట్రేడ్ లైసెన్స్‌లపై ఫీజులో 25 శాతాన్ని పెనాల్టీ వేస్తున్నారు. ఈ క్రమంలోనే వచ్చే నెల 1 నుంచి నెలాఖరు వరకు 50 శాతం జరిమానాగా వసూలు చేయనున్నారు. ఏప్రిల్ నుంచి రెన్యువల్ చేసుకునే వ్యాపారుల నుంచి చెల్లించాల్సిన ట్రేడ్ ఫీజులో వంద శాతం జరిమానా వసూలు చేయనున్నారు. కాగా మెడికల్ ఆఫీసర్, లైసెన్సింగ్ ఆఫీసర్ ప్రతి రోజు కనీసం 20 వ్యాపార సంస్థలను నేరుగా కలిసి వ్యాపారస్తుల నుంచి ముక్కుపిండి ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం (ఈ నెల 23వ తేదీ) నాటికి 78 వేల మంది వ్యాపారస్తుల నుంచి బల్దియా రూ. 76 కోట్ల మేర ట్రేడ్ లైసెన్స్‌ల రూపంలో ఆదాయాన్ని సమకూర్చుకున్నది. ఇంకా 32 వేల మంది వ్యాపారస్తులపై స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికల్లా రూ. 120 కోట్ల వరకు ట్రేడ్ లైసెన్స్ ఆదాయం రాబడతామని అధికారులు తెలిపారు.

దరఖాస్తులు సరే..

కార్డుల మంజూరెప్పుడు?

ఒక అడుగు ముందుకేసి.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే రేషన్ కార్డులు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. కానీ ఎవరికి ఇవ్వాలి.. ఎలా ఇవ్వాలో సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

గందరగోళంలో దరఖాస్తుదారులు

రేషన్ కార్డు వస్తుందో లేదోననే అయోమయంలో దరఖాస్తుదారులున్నారు. ఏడాదిలోనే నాలుగుసార్లు దరఖాస్తు చేసుకోమనడంతో ప్రభుత్వంపై నమ్మకం కోల్పోతున్నారు. దరఖాస్తు చేసుకోమంటున్నారు కానీ ఇస్తరో ఇవ్వరో అనే నిరాశలో ఉన్నట్లు తెలుస్తున్నది. తమ రేషన్ కార్డు స్టేటస్ ఏంటని తెలుసుకునేందుకు నిత్యం మీసేవలో వాకబు చేస్తున్నారు. సర్వేకొచ్చిన అధికారులను అడిగితే తమకు తెలియదనడంతో ఎవరిని అడగాలో తెలియని గందరగోళంలో ఉన్నారు. అన్ని అర్హతలున్నా రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు అర్హులు కాలేకపోతున్నామని నగర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని అనుమానాలను తొలగించి త్వరితగతిన రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

రేషన్‌కార్డుల జారీపై ప్రభుత్వానికి స్పష్టత కరవు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులిస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కార్ దరఖాస్తులతో కాలయాపన చేస్తున్నది. ఏడాది నుంచి ఇప్పటిదాకా అర్హులు నాలుగుసార్లు దరఖాస్తు చేసుకున్నారు. ప్రజాపాలన దరఖాస్తులు, గ్రామ-వార్డు సభలు, ప్రజావాణి, మీసేవలో పలుమార్లు దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు రేషన్ కార్డుల జారీపై ప్రకటనలకే పరిమితమైంది. ఎవరికి ఇస్తారు? ఏ ప్రాతిపదికన ఇస్తారో సరైన మార్గదర్శకాలు జారీ చేయలేదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జీహెచ్ఎంసీ సిబ్బంది, పౌర సరఫరాల శాఖ అధికారులు లబ్ధిదారులను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. కానీ.. ఏ ప్రాతిపదికన రేషన్ కార్డులిస్తారు? అర్హులు ఎవరు? అర్హతగా దేన్ని ఆధారంగా చేసుకుంటారని అడిగితే తమకు తెలియదని, సర్వే చేయడం వరకే తమ బాధ్యతని చెబుతున్నట్లు అర్జీదారులు అంటున్నారు. తమకు రేషన్ కార్డు వస్తుందా? లేదా? అనే అయోమయంలో ఉన్నామనవి వాపోతున్నారు.

సరైన మార్గదర్శకాలేవి?

రేషన్ కార్డులు మంజూరు చేస్తామని చెప్పడం, దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించడం తప్ప.. సరైన మార్గదర్శకాలు మాత్రం జారీ చేయలేదు. అర్హులకు ఏ ప్రాతిపదికన కార్డులు ఇస్తారో అటు ప్రభుత్వానికి, ఇటు అధికారులకు స్పష్టత లేకుండా పోయింది. మరికొద్ది రోజుల్లో రేషన్ కార్డులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి, మంత్రులు ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. సీఎం ప్రభుత్వం స్పష్టత ఇచ్చేదాకా ప్రజల్లో గందరగోళం తొలగే పరిస్థితి లేదు. సమస్యలన్నింటినీ తొలగించి తమ ఇబ్బందులకు స్వస్తి పలకాలని కోరుతున్నారు.

జేసీబీ సీజ్

పరిగి, ఫిబ్రవరి 23 : పరిగి మండలం నజీరాబాద్‌తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా మట్టి తవ్వుతున్న జేసీబీని అటవీ శాఖ అధికారులు సీజ్ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో అటవీ ప్రాంతంలో మట్టి తవ్వుతున్నట్లు సమాచారం అందడంతో అటవీ అధికారులు అక్కడికి వెళ్లి జేసీబీని సీజ్ చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రతిమ తెలిపారు. అటవీ ప్రాంతంలో మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడలతో మానసికోల్లాసం

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 23 : క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం డీన్ డా.సతీశ్‌కుమార్ అన్నారు. మూడో ఇంటర్ కాలేజ్ క్రీడా సాహితి, సాంస్కృతిక పోటీలు రెండోరోజు ఉత్సాహంగా జరిగాయి. ఆదివారం రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో జరిగిన పోటీల్లో మాట్లాడుతూ.. పోటీతత్వం ఉన్నప్పుడే ఉత్తమ లక్ష్యాలకు కనుగుణంగా పనిచేయగలరన్నారు. రిజిస్ట్రార్ శరత్‌చంద్ర మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు, శారీరక ధృఢత్వం ఎంతో అవసరమన్నారు. తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటాలని సూచించారు. వర్సిటీ పరిధి రాజేంద్రనగర్, మామునూర్, కోరుట్ల, కామారెడ్డి, పెబ్బేర్ కళాశాలల నుంచి 250 మంది విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన
సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ M/s శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ నారాయణపేట బ్రాంచ్ వారు Kindati Krishnaiah S/o Kankappa, age 45 years, Occ: Business, R/o H.No.1-28, Thimmareddy pally Village, Doulthabad Mandal, Narayanpet Dist., **Applicant / Borrower / Prop. Holders** K.Krishnaveni W/o Kindati Krishnaiah, age 37 years, Occ: Business, R/o H.No. 1-28, Thimmareddy pally Village, Doulthabad Mandal, Narayanpet Dist.,గారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారాలలో తమ సొంత ఆస్తిని తనఖా పెట్టుటకు అంగీ కలించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరి కైనా ఆక్షేపణలు మరియు క్లెయిములు ఉన్న యెడల ఈ తేది నుండి 3 రోజులలో మా ఆఫీస్‌లో గాని లేదా మా క్లయింట్ ఆఫీస్‌లో గాని సంప్రదించగలరు.
SCHEDULE OF THE PROPERTY
The Residential house H.no.1-28, admeasuring 184.00 Sq.Yrds., out of Assessment No.38, situated at Thimmareddypally Village, Doulthabad mandal, Vikarabad Dist.,which is bounded as under; **East:** House of M.Lakshmi, **West:** House of Patel Manikyappa, **North:** C.C Road, **South:** House of G.Kistappa.
MALLIKARJUN B.A, LL.B., Advocate, 1-6-41/12, Satya Sai Colony, Narayanpet. Cell: 9440393742

SHRIRAM Finance
వాహనములు అమ్మబడును

Veh.No.	Vehicle Description	YMF
TS34G6786	SCROSS ALPHA BS6 PETROL 5 SEATER	2021
TS11ER-8776	SWIFT DZIRE VDI DIESEL 5 SEATER	2014
AP35AF-2108	TAVERA NEO LS BS3 DIESEL 7 SEATER	2016

పై వాహనాలు తేది 25-02-2025 నాడు వేలం వేయబడును
అడ్రస్: శ్రీరామ్ ఆటో మాల్ యార్డ్, భూత్పూర్, మహబూబ్‌నగర్
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
మొదటి అంతస్తు, ఇంటి నం. 7-139, బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ దగ్గర, పరిగి, వికారాబాద్ జిల్లా-501501. మొబైల్ నం. 9701338886